# బాపూ బొమ్మ - 9

కాసేపటికి రత్తాలు ఆయాసపడుతూ వచ్చింది.

నీలమ్మ వచ్చిన సంగతి, సుమతి టీచరు ఇంటికి పంపించటం అన్నీ చెప్పాను.

''మంచి పని చేశారమ్మా...'' అంటూ తేలిగ్గా ఊపిరి తీసుకుంది.

నీలమ్మ కనుపించకపోవటంతో పెళ్ళికి ముందు రోజు రమ్మని చెప్పి వాళ్ళంతా ఊరికి వెళ్ళిపోయారట. లేకపోతే నీలమ్మతో సహా వాళ్ళని ఆరోజే తీసుకువెళ్ళి అక్కడ నుండే మీ చుట్టాలు నలుగురినీ పిలుచుకోవచ్చంటూ పంతం పట్టుక్కూర్చున్నారట. ఆ ఊరికి వాళ్ళతో పాటుగా ఇపుడే వెళ్ళిపోతే, ఇక ఏం చేయటానికీ, అవకాశం ఉండదనే ఆలోచనతో ప్రయాణం తప్పించుకునే ఉపాయం రత్తాలు అలా ఆలోచించి నీలమ్మను మా ఇంటికి పంపించింది! రత్తాలూ తెలివిగానే ఆలోచించింది.

''రత్తాలూ... నీకు సుమతీ టీచరు ఇల్లు తెలుసుగా, వెళ్ళి ఆ టీచరుకు పెళ్ళి జరిగే తేదీ, సమయం, ఊరిపేరు చెప్పి, నీలమ్మను ఇంటికి తీసుకెళ్ళిపో. ఏం భయం లేకుండా పెళ్ళికి బయలుదేరి వెళ్ళండి. తప్పకుండా పోలీసులు ఆ సమయానికి వచ్చి పెళ్ళి ఆపు చేస్తారు. అపుడు మీ అమ్మాయిని చక్కగా చదివించుకో'' అని చెప్పి ''ఒక్క నిముషం'' అంటూ నా పెట్టిలో అడుగున దాచిన కవరులోని డబ్బులో సగం తెచ్చి రత్తాలు చేతిలో పెట్టాను.

ఆ డబ్బును చూస్తూనే రత్తాలు కళ్ళు పెద్దవి అయ్యాయి.

''ఏంటమ్మా...ఇం...త డబ్బు నాకెందుకు ఇస్తున్నారూ..?'' ఆశ్చర్యంగా అడిగింది. ''నీలమ్మ చదువుకీ, ఇంకా నీకేమైనా అవసరాలు వచ్చినపుడూ తీసి ఖర్చు పెట్టుకో. ఇవి మా అత్తగారివేం కాదులే. మా అమ్మావాళ్ళు ఏదైనా నగ చేయించుకోమని ఇక్కడకు వచ్చే ముందు ఇచ్చారు. నా ఇష్టం వచ్చినట్లు ఖర్చు చేసుకునే హక్కు ఉంది. ఆ డబ్బులో కొంతయినా నీలమ్మకి ఉపయోగపడితే నాకు చాలా ఆనందంగా ఉంటుంది రత్తాలూ'' అని చెప్పాను.

రత్తాలు ''నీలమ్మ చదువుని ఆపనమ్మా. డబ్బు తీసుకోటానికి నాకు మనసొప్పటం లేదు'' అంటూ తిరిగి ఇచ్చేయ్యబోయింది. నేను నచ్చచెప్పిన తరువాత ఒప్పుకుంది.

''అమ్మా..మీదెంత మంచి మనసు..ఇన్ని ఆలోచనలూ ఉన్నాయి. ఈ ఇంటిలోకి ఎలా వచ్చిపడ్డారమ్మా..'' అంది కళ్ళనిండా నీళ్ళు నింపుకొని...

నిట్టూర్చి వూరుకున్నాను.

''నాగమ్మతో అబ్బాయిగోరి యవ్వారం అందరికీ తెలుసిక్కడ. అందుకే పెద్ద పెద్దోళ్ళెవ్వరూ పిల్లనివ్వటానికి మొగ్గు చూపలేదు. ఆరి ఆస్తులేవో అన్ని కోరుటు కేసుల్లో ఉండిపోనాయంట. అంతేకాకుండా ఆళ్ళు కూడా పెద్దమ్మగోరికి దీటైన గడ్డు మనసులేనండి బాబూ, ఆ భయంతోనే అమ్మగోరు నాగమ్మని వద్దనుకున్నారు.

ఆళ్ళేం తక్కువ కాదుగదా, ఒకరోజు పదిమంది ఇంటిమీదకు కర్రలతో వచ్చి మా పిల్లతో కాకుండా

నీ కొడుక్కి వేరే వాళ్ళతో పెళ్ళి ఎలా చేస్తావో చూస్తానంటా బాగా బెదిరించి యాగీ చేసి పోయారండి. అమ్మగారికీ పంతం వచ్చి ఆరి పుట్టింటి ఒకాయన ద్వారా మీ సంబంధం కుదుర్చుకున్నారండీ. ఎవరికీ ఆ ఊసే తెలీనివ్వలేదు. పెళ్ళికి రెండు రోజుల ముందరే అందరికీ తెలిసింది. నాగమ్మ గారి బంధువులు మీ ఇంటికి వచ్చి గొడవ చేద్దామనుకున్నారట గానీ, మీ ఊళ్ళో మీ కుటుంబానికున్న మంచి పేరును బట్టి 'పోనీలే' అని వూరుకుండిపోయారని చెప్పుకున్నారు. ఆ తర్వాత ఇచిత్రంగా పెద్దకోరుటులో నాగమ్మ గారి వాళ్ళే కేసు గెలిచారట. ఆస్తి వచ్చిందనీ చెప్పుకున్నారండీ...''

అత్తగారు, ఆయనగారు ఇంట్లో లేరు కదాని ధైర్యంగా తనకు తెలిసిన విషయాలను రత్తాలు ఏకరువు పెట్టింది.

చెబుతున్నంత సేపూ రత్తాలు కళ్ళు తుడుచుకుంటూనే ఉంది!

నేను నిర్లిప్తంగా విన్నాను.

అలాంటిదేదో ఉండబట్టే సంబంధం వెతుక్కుంటూ మా ఊరువరకూ వచ్చి ఉంటారని నేను అనుకుంటున్నదే కదా...!

ఆ మరునాడు వచ్చి అత్తగారికి తన పిల్ల పెళ్ళి కబురు చెబుతానంది. వెళ్ళబోతూ ఒక్కక్షణం ఆగి వెనక్కి వచ్చి హెచ్చరిస్తున్నట్లుగా ''జాగర్తమ్మా....పొమ్మనలేక పొగబెట్టినట్టు చేస్తారేమో..'' అంది.

ఆ ఇంటిలోని మనుష్యుల మీదా, మరి దేనిపైనా గానీ, నాకు స్వంతమనే భావం, ఇష్టం ఏర్పడనే లేదు! ఇక అలాంటపుడు వదులుకోవలసి వస్తుందనే బాధేం ఉంటుందీ..!

మా అత్త, ఆయన ఊరెళ్ళారు. కాబట్టి రత్తాలు ఆరోజు ఏదో పని ఉందంటూ, ఇంటికి వెళ్ళటం మంచిదయిందని సంతోషించింది. రాజయ్య,బంధువులతో చెప్పాపెట్టకుండా వచ్చినందుకు, తను ఇంట్లో ఉండబట్టే, నీలమ్మను బయటకు పంపించి, ఆ తర్వాత పెళ్ళి ముందు రోజుకు వస్తామంటూ వీళ్ళని పంపించెయ్యగలిగామని ఆనందించింది.

అప్పటికి సరే, ఆ తర్వాత పెళ్ళి తప్పించుకోగలిగి నీలమ్మ తన కోరిక ప్రకారం చదువునూ కొనసాగించగలిగితే బావుంటుందని నేనూ కోరుకున్నాను.

ఆ సాయంకాలమే అత్తగారు, ఆయనా ఊరునుండి వచ్చారు. ఇద్దరూ ఎందుకో దిగులుగా కనిపించడంతో, చావు బతుకుల మధ్యనున్న ఆ బంధువులావిడ చనిపోయింది కాబోలనుకున్నా! మెల్లగా ఆ మాట అడిగేసరికి ఆవిడ చిరాకు పడింది 'అదే జరిగితే వెంటనే ఎందుకొచ్చేస్తాం' అంటూ.

మరి..దేనికి అలా ఉన్నారో... అర్థం కాలేదు! ఇంటికి నలుగురు బంధువులు వస్తే, తిండి దండగ అనుకునే ఆవిడ ఎవరినీ రమ్మనదు, రానివ్వదనీ గ్రహించాను. అలాంటి స్వభావం కనుక ఒకవేళ.. ఆ బంధువులావిడ బతికి బట్టకట్టడం వలన తమ ప్రయాణం దండగైపోయిందని విచారించడం లేదుకదా..?

నా ఆలోచనకి నేనే లోలోపల నవ్వుకున్నా!

రెండురోజుల తర్వాత ఆ ఇద్దరూ ఒకరినొకరు దెప్పుకుంటున్న మాటల్ని బట్టి..వీళ్ళు ఎదురుచూచిన

ఆస్తి ఏదో దక్కలేదనీ, ఆవిడ వీలునామా మార్చిందనీ, అందుకే అలా ఏదో పోగొట్టుకున్న దిగులుతో కనిపిస్తున్నారనే విషయాన్ని కొంచెంగా ఊహించి తెలుసుకున్నా!

ఆయన కూడా కొంచెంగా ఇంటిపట్టున ఉండటమూ ఆశ్చర్యకరమే..!

అనుకున్నట్టుగానే ఆ మరునాడు రత్తాలు వచ్చి నీలమ్మ పెళ్ళికి రెండురోజుల్లో ఆ ఊరు వెళ్తామని చెప్పినపుడు మా అత్తగారు సంతోషిస్తూ '' నా దగ్గరకు తీసుకువస్తే, చివాట్లు పెట్టయినా ఒప్పిస్తానన్నాను. ఆ అవసరం లేకుండా నీ కూతురే ఒప్పుకుంది. తెలివైనదే..ఎప్పటికయినా ఎవరో ఒకర్ని కట్టుకుని వెళ్ళాల్సిందేగా అని తెలుసుకోగలిగింది. మంచి కబురు చెప్పావు..!'' అని నావైపు విజయగర్వంలాంటి భావంతో చూశారు.

చదివించమనే నా సలహా కాకుండా రత్తాలు తన మాట ప్రకారమే పెళ్ళి చేస్తున్నందుకు నా మీద పై చేయి సాధించిన ఆనందం ఆమెలో కనిపించింది.

ఇక అసలు జరిగిన సంగతీ, జరగబోయేదీ తెలిస్తే అత్తగారి హావభావాలు ఎలా ఉంటాయో..! అందులో నా ప్రమేయమూ ఉందంటే..ఇంక చెప్పాలా, అరికాలి మంట నెత్తికెక్కదూ...!

★ ★ ★

అటూ ఇటూ తిరుగుతున్నపుడు అత్తగారు, ఆయనగారి సంభాషణల్లోని కొన్ని మాటలు నా చెవినబడ్డాయి.

''నువ్వు పూర్తిగా దాని వగలూ, హొయలుకి కట్టుబడి పోయావు. అక్కడ అందరూ వంశాకురం ఎప్పుడూ అని అడుగుతోంటే.. ఏం చెప్పాలో తోచలేదు!''

''నీకు ముందే చెప్పానా లేదా..?''

''అయితే మాత్రం...పరిస్థితిని బట్టి పట్టూ విడుపూ ఉండాలి!''

''ఆ మాట నువ్వూ తెలుసుకోవాలి.! నా మీద ఎంత ప్రేమ లేకపోతే..వచ్చిన సంబంధాలన్నీ తిరగగొట్టేస్తుందీ..?''

''ఖర్మ నీకు అర్థమవ్వటం లేదు... ఏదీ కుదిరి చావటం లేదు!''

ఆ మాటల అంతరార్థం ఏమిటో... అని ఆలోచించలేదు. అక్కడ ఏదో జరిగి ఉంటుంది అనుకుంటున్నా. ఈ డబ్బు మనుష్యులకు...అక్కడ డబ్బు కాకుండా ఇంత గడ్డి వడ్డించి పంపించారేమో అనుకోగానే నాకు నవ్వు వచ్చింది. అంతకుమించి అసలు విషయం ఏమై ఉంటుందీ అని ఆలోచించలేదు.

నా ఆలోచనంతా..నీలమ్మకి పెళ్ళి అయిపోలేదు గదా అనే భయమే! అంతా సవ్యంగా జరిగి, ఆగిపోయి వుంటే.. ఆ వార్త నాకు వెంటనే తెలిసే వీలు ఉండి వుంటే ఎంత బావుండేదీ..!

ప్చ్.. రత్తాలు ఎపుడు వస్తుందో... ఏం జరిగిందన్నది అపుడేగా తెలుస్తుందీ.! మాటిమాటికీ ఈ ఆలోచనతోనే రత్తాలు రాకకోసం ఎదురు చూశాను.

పెళ్ళి అనుకున్న మరుసటి రోజు రత్తాలు రానే వచ్చింది.

అత్తగారితో మాట్లాడుతోంటే, నేనూ ఆత్రంగా అక్కడ నిలబడి విన్నాను.

పోలీసులొచ్చి పెళ్ళి జరగకూడదని ఆపు చేశారన్న మాట చెవిన పడగానే నేను చాలా తేలికగా ఊపిరి పీల్చుకుని స్థిమితపడ్డాను!

అత్తగారి మొహంలో మాత్రం ఆశ్చర్యంతో రంగులు మారిపోయాయి. అలా జరగొచ్చనేది ఆమె ఊహకందని విషయం మరి..!

'' మీ పిల్లదానికి అంత ధైర్యం ఎలా వచ్చిందే..? టీచరుకి చెబితే, ఆవిడ పోలీసులకి చెప్పిందా..? చిన్నపిల్లకి అన్ని తెలుస్తాయా..? మీరంటే గిట్టని వాళ్ళెవరో దానికి బాగా నూరిపోసి ఉంటారు! పెళ్ళి చేయటం కంటె చెడగొట్టటమే ఘనకార్యమనుకునే పెడబుద్ధులవాళ్లూ కొందరుంటార్లే..! ఆ తరవాత ఏమైందీ...? ఆ ఊరివాళ్ళంతా కలిసి మీతో గొడవ పెట్టుకోలేదుకదా..? మళ్ళా ఈ సారి ముహూర్తం పెట్టుకునేటపుడు ఇలాంటివి జరగకుండా జాగ్రత్తపడండి! పిచ్చివేషాలు వేస్తే కుదరదని పిల్లకి బాగా బుద్దీ, భయం చెప్పండి..!''

రత్తాలుకి వచ్చిన కష్టానికి బాధపడిపోతున్నట్లుగా చాలా ఆవేశంగా మాట్లాడింది మా అత్తగారు!

రత్తాలు మొహంలోని దిగులును నిలుపుకుంటూనే మెల్లగా అసలు విషయం బయటపెట్టింది ''పెళ్ళి.. పెళ్ళి.. ఆగిపోలేదమ్మా.. జరిగిపోయింది. మా నీలమ్మతో కాదు... ఆ వాడలోనే ఉంటది మంగ అనీ... ఆరేళ్ళ క్రితం దానిని వాళ్ళాయన వదిలి పారిపోయాడు. ఎవతినో కట్టుకుని ఎక్కడో ఉంటున్నాడని కబురు తెలిసాక పనీపాటా చేసుకుంటా, పిల్లాడిని చదివించుకుంటోంది... ఆ మంగనే మా తమ్ముడు మనువాడాడు!

'నీలమ్మని చేసుకుని చదివిద్దామనుకున్నా.. ఇపుడు.. వీడినే కొడుకనుకుని సక్కగా చదివిస్తానన్నా'డమ్మా..! పోలీసులు చివాట్లేసి వెళ్ళిపోగానే ఆడికే ఈ ఆలోచనొచ్చి అడిగితే మంగా ఇష్టంగా తలవూపింది! రాజయ్య కంటే ఓ రెండు మూడేళ్ళు తక్కువ ఉంటాయేమో ఆ మంగకి. పెద్దలంతా ఆ పెళ్ళి చూసి, భోజనాలు కానిచ్చేసి.. నవ్వుకుంటా ఇళ్ళకి వెళ్లిపోయారు..!''

మా అత్తగారు బుగ్గలు నొక్కుకుంటూ విచిత్రంగా చూసింది! ''పిదప కాలం.. పిదప బుద్దులూ అంటారు.. ఇలాంటివి చూసే! లేకపోతే.. మగవాడికైతే రెండో పెళ్ళి మామూలే అనుకో..! పనిపాటలు చేసుకుని బతుకుతున్న దానిని.. మొగుడొదిలేసిన దానిని.. వాడు చేసుకుంటాననటం ఏమిటీ... పిల్లాడు ఉన్నా అదీ రెడీ అయిపోవటం ఏమిటీ? ఏ పెళ్ళి అయితేనేం, భోజనాలు పెట్టారు.. అంతే చాలన్నట్లు పెద్దలంతా ఆనందించేశారా..? ఛ..ఛ... ఎంత దరిద్రమో...!'' చీత్కారంగా అంది.

నేను మాత్రం సంభ్రమాశ్చర్యాలతో మాట రానట్లుగా ఒక క్షణం అలాగే నిలబడిపోయా. మరుక్షణమే తేరుకుని రత్తాలుపై ప్రశ్నల వర్షం కురిపించేశా!

''నిజంగా అలా జరిగిందా రత్తాలూ..? ఈ రోజు చాలా మంచి విషయం విన్నాను. రాజయ్య మోటుగా, పిల్లలు చూస్తే భయపడేట్లు ఉంటాడని చెప్పావే..? చూపులకి అలా ఉంటాడుగానీ మనసంత మంచిది అన్నమాటేగా..? మంగ కొడుకుని తన కొడుకులా చదివిస్తానని అన్నాడంటే.. చాలామంది చదువుకున్న వాళ్ళల్లో లేని సంస్కారం అతనికి ఉందన్నమాట నిజమేగా..? వూరి వాళ్ళంతా కూడా అసలైన పెద్దమనష్యులనిపించారు కదూ..? రాజయ్య నిర్ణయానికి అనవసరమైన అడ్డుపుల్లలు వేయకుండా అక్షింతలేసి ఆశీర్వదించారు! అవునుకదూ..?''

నా మాటలకి అత్తగారు మౌనంగానే ఉరుముతున్నారని గ్రహించాను.

కానీ నేనదేం గమనించనట్లుగానే గడగడమని మాట్లాడేశాను.

రత్తాలు ''అవునమ్మా..'' అంటూ తల వూపింది.

''కొందరు మాత్రం 'ముహూర్తం దాటిపోయిందిగా, మళ్ళా మంచిరోజు చూసి మంగను చేసుకోవచ్చు'లేరా.. అన్నారు. కానీ వాడు వినిపించుకోలేదండి. 'మంచి లగ్నంలోనే మంగను పెళ్ళిచేసుకున్నోడు ఏం చేశాడూ.. పిల్లాడినీ, దీన్ని వదిలిపెట్టి పోతే ఏమయింది...? నేనేం చాటుమాటుగా కాకుండా పెద్దలందరి ముందునే చేసుకుంటున్నాను. మా ఇద్దరిలో ఎవరం తప్పుదారి పట్టినా.. నిలదీసి బుద్ధి చెప్పండి... సరిదిద్దుకుంటాం..'అన్నాడండీ! ఎవరో ఒకాయన ఏదో అన్నాడండీ..'' అంటూ రత్తాలు జ్ఞాపకం చేసుకుంటున్నట్లుగా ఆలోచనలో పడింది.

మాట కూడబలుక్కుంటున్నట్లుగా.. ఆగి ఆగి చెప్పుకొచ్చింది. ''మదిలోకి.. మంచి ఊసు ఎపుడొస్తే అది మంచి.. మంచి చ్ఛణమే.. ఎంటనే చేసెయ్యాలీ..' అని చెప్పాడమ్మా...!'' అంది రత్తాలు.

''అప్పుడు.. ఇంకొందరూ.. 'పసిపిల్లను చేసుకుంటానంటే కాదనకుండా వచ్చినవాళ్ళం... ఇపుడు వాడు.. వాడికి జోడైన దానిని చేసుకుంటానంటే ఎందుకు కాదనటం.. కానియ్ రాజయ్యా..' అన్నారండీ!'' అంది మళ్ళీ.

''రత్తాలూ.. నేనుగానీ అక్కడ ఉండి వుంటే.. రాజయ్య చేసిన పనికి ముచ్చట పడి చప్పట్లు కొట్టి 'సెభాష్ రాజయ్యా..!' అనే దాన్ని తెలుసా..!'' అన్నాను ఉత్సాహంగా.

మా అత్తగారు మాత్రం మొహంలోనే రుసరుసలు చూపిస్తూ ''సరేలే.. పెళ్ళి చేసి పిల్లనీ వాడినీ వెంటబెట్టుకు వస్తే.. ఏదో ఇద్దామనుకున్నా..! ఇపుడేమో.. పెళ్ళి ముచ్చట కాస్త ఇలా ముక్కలైందనే కబురు మోసుకు వచ్చావు.. సరేలే.. ఇంకేం వుందీ..' అని లోపలకి వెళ్ళబోతుంటే " అమ్మగారూ.. ఒక మాటండీ..'' అంటూ రత్తాలు ఆపింది.

''మా పిల్లని.. మా అక్క, వాళ్లూరికి తీసుకుపోయి ఇక అక్కడే చదివించుకుంటానని చెప్పిందమ్మా. ఆ కాగితాల గొడవేదో టీచరమ్మగారే చూస్తానన్నారు. మేం మాత్రం ఇక్కడెందుకని అక్కా వాళ్ళ పక్కనే ఇల్లు చూసుకుని ఉందామనుకుంటున్నామండీ. ఇక్కడ చేసే పనులు అక్కడ చేసుకుందామని ఉందండి..'' అని చెప్పింది.

''అంటే.. పని మానేసి మకాం ఎత్తేస్తున్నామని చెప్పటానికి వచ్చావా..? " ఆశ్చర్యంగా చూసింది అత్తగారు.

అవునన్నట్లుగా రత్తాలు తలవూపింది.

''ఇక్కడ ఉన్నట్లుగా పట్నంలో మీకు జరుగుతుందనుకుంటున్నావా?'' కోపంగా అరిచింది. ''ఇంత హఠాత్తుగా చెప్పటం ఏమిటీ..?''

''నిజమేనమ్మా.. జరుగుబాటు ఇక్కడలా అక్కడ ఉండదు. మేం దగ్గరగా ఉంటే నీలమ్మకీ బావుంటుంది,

పెద్దమ్మ దగ్గర అలవాటయ్యేంతవరకూ. ఆ తరవాత అక్కడ బావుంటే అక్కడే ఉండిపోతాం.. లేకపోతే మనూరికే తిరిగొచ్చేస్తామమ్మా. నాగన్నకి చెబితే వాళ్ళ బంధువులెవరో ఉన్నారంట. ఓ వారం పదిరోజుల్లో మనింట్లో మీతో మాట్లాడి కుదురుస్తానన్నాడమ్మా'' వివరంగా చెప్పింది.

''అన్ని ఏర్పాట్లూ చేసుకునే వచ్చావుగా.. సరేలే..'' అంది అత్తగారు విసురుగా.

మా అత్తగారితోనో లేక ఆవిడ లోపలకు వెళ్తే నాతోనో ఏమైనా చెప్పాలని రత్తాలు అనుకుందేమో... సందేహంగా చూస్తూ అలాగే నిలబడింది.

అత్తగారు ''హు..'' అని హుంకరించినట్లుగా అనేసరికి మెల్లగా అడుగులో అడుగులేస్తున్నట్లుగా నడిచింది.

నేనలాగే చూస్తూ నిలబడ్డాను.

బయటకు అడుగులేస్తూ రత్తాలు ఒక క్షణం వెనుదిరిగి నా వేపు చూస్తూ కొంచెంగా

చిరునవ్వు నవ్వింది ! ఆ చిరునవ్వులోని సంతృప్తిని గమనించిన నా మనసులో ఎంత సంతోషమో ...!

అత్తగారి ఎదుట కూతురి పెళ్ళి తప్పిపోయిందన్న దిగులు తప్పనిసరిగా ప్రదర్శించాలన్నట్లుగా అలా దిగులుగా కనిపించిందేగానీ....అది నిజం కాదన్నమాట ! లోలోపల కూతురి చదువు కోరిక నెరవేరుతున్నందుకు సంతోషమే !

★ ★ ★